మున్సిపల్ భవనానికి స్థలం ఎంపిక చేయండి

• కలెక్టర్ కోయ శ్రీహర్ష


పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: మంథని మున్సిపల్ భవన నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. గురువారం మంథనిలో పర్యటించి పురపాలక కార్యాలయానికి స్థలాలను పరిశీలించారు. పట్టణంలోని పాత ఎస్సీ హాస్టల్, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న 26 గుంటల స్థలాన్ని పరిశీలించారు. పురపాలక భవనానికి అనువైన చోటు ఎంపిక చేయాలని, త్వరలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి ట్రెంచ్ కటింగ్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి లోపు ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తి చేయాలని, ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తూ పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు, సంబంధిత భూములను నేషనల్ హైవే అథారిటీకి అప్పగించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజన్ అధికారి సురేశ్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సర్వే ల్యాండ్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందజేత


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులు చలితీవ్రత నుంచి తట్టుకునేందుకు వీలుగా జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవోలతో కలిసి గురువారం కలెక్టర్ శ్రీహర్ష సమక్షంలో దుప్పట్లు అందజేశారు. అంతకు ముందు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బాల్యమిత్రుల ఆర్థిక చేయూత


ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తున్న మిత్రులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన విజయగిరి లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనితో పాటు 1996–97లో పదో తరగతి చదివిన అతని మిత్రులు లక్ష్మీనారాయణ కుటుంబానికి సాయం అందించేందుకు డబ్బులు సేకరించారు. మిత్రుడి కూతురు ప్రణీత పేరు మీద రూ.25వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గురువారం డిపాజిట్ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంతోష్, శ్రీనివాస్, తిరుపతి, ఎండీ రహీంఖాన్, ఐలయ్య పాల్గొన్నారు.

పెండింగ్ అలవెన్సులు చెల్లించండి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో పనిచేస్తున్న వాటర్ సప్లై కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ అలవెన్సులు చెల్లించాలని రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ అనుబంధం) ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్ డిమాండ్ చేశారు. టౌన్‌షిప్ సివిల్ కార్యాలయం ఎదుట జరిగిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. మూడురోజులుగా కార్మికులు నిరసన చేస్తుండడంపై సదరు కాంట్రాక్టర్ చర్యలపై ఆయన మండిపడ్డారు. ఒప్పందం ప్రకారం ప్రతీనెల కార్మికుడికి రూ.1,020 చొప్పున చెల్లించడానికి అంగీకారం కుదిరిందన్నారు. 13 నెలల నుంచి కార్మికుడికి చెల్లించకపోవడం దారుణమని వాపోయారు. కార్మికులకు చెల్లించాల్సిన అలవెన్సుల జాప్యంపై ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఉన్నతాధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. సంబంధిత విభాగం అధికారులు స్పందించి కాంట్రాక్టర్ ద్వారా కార్మికులకు ఏరియర్స్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ రహదారి పనుల అడ్డగింత


పనులు అడ్డుకుంటున్న ఆదివారంపేట రైతులు

రామగిరి: మండలంలోని ఆదివారంపేట గ్రామంలోని భూముల్లో జరుగుతున్న జాతీయ రహదారి పనులను గురువారం ఆదివారంపేట రైతులు అడ్డుకున్నారు. రహదారి పనులు త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో ట్రెంచ్ కొట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు తహసీల్దార్ రాంచందర్‌రావు, గిర్దావర్లు మహేశ్, రవిశంకర్, రామగిరి పోలీసులు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. తమకు పూర్తి పరిహారం చెల్లించే వరకు ఎలాంటి పనులు నిర్వహించొద్దని రైతులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

దొంగతుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామ పంచాయతీని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని దొంగతుర్తి మండల సాధన కమిటీ డిమాండ్ చేసింది. గ్రామంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో గురువారం గ్రామ యువకులు సమావేశమై మండల సాధన సమితిగా ఏర్పాటు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ధర్మారం మండల కేంద్రం 15 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దొంగతుర్తి చుట్టుపక్కల దాదాపు 10 గ్రామాలున్నాయని, ఈ గ్రామాలకు దొంగతుర్తి మండల కేంద్రంగా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ గ్రామాన్ని మండలకేంద్రంగా ఏర్పాటు చేస్తే ప్రజలకు రైతులకు అన్నివిధాలుగా సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. మండల సాధన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో పనిచేసే మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్ సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయుష్మాన్ ఆరోగ్యమందిర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు రవిసింగ్, రాజమౌళి, వాణిశ్రీ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన


నిరసన ప్రదర్శనలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ గురువారం జిల్లా కేంద్రంలో సమగ్రశిక్షా ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. 24 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న ఉద్యోగులు గాంధీ విగ్రహానికి సమస్యలను విన్నవించారు. నాయకులు మల్లన్న, పోశం, శ్రీకాంత్ సంఘీభావం ప్రకటించారు. సుధాకర్, సంధ్యారాణి, రాజ్‌కుమార్, తిరుపతి, సంపత్, పిల్లి రమేశ్, స్వప్న, కమల, జ్యోతి, రవీందర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న మంత్రి పీఏ చంద్రశేఖర్

మంథని: నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా మంజూరైన చెక్కులను గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పీఏ ఆకుల చంద్రశేఖర్ పంపిణీ చేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.2.72 కోట్ల విలువ గల చెక్కులను 443 మంది లబ్ధిదారులకు అందజేశారు.

వైద్య శిబిరానికి స్పందన

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ జీఎల్‌టీ కోఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. 150 మంది రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్నవారిని గుర్తించి, ఉచిత రవాణా, వసతి సౌకర్యాలు కల్పించి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల డాక్టర్ భాస్కర్ మాడేకర్ చైర్మన్, కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్, ప్రభాకర్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, గజబీంకార్ జగన్, కోశాధికారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు అందజేత


దుప్పట్లు అందజేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ యూనివర్సల్ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోకుండా వినూత్నంగా ఆలోచించారు. క్లాస్‌లోని పిల్లలందరూ కలిసి విరాళాలుగా సేకరించిన డబ్బులతో పేదవారిని గుర్తించి 20మందికి దుప్పట్లు అందజేశారు. సదరు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, టీచర్లు, స్థానికులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

• 95శాతం సర్వే పూర్తి
ముత్తారం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, సమగ్ర కుటుంబ సర్వే 95శాతం పూర్తయిందని గురువారం ఎంపీడీవో సురేశ్ తెలిపారు. మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం
పెద్దపల్లిరూరల్: పట్టణంలోని తిలక్‌నగర్, జెండా చౌరస్తా, లాల్‌చింత, సాగర్‌రోడ్, అమర్‌నగర్, క్రిస్టియన్‌కాలనీ, ప్రగతినగర్, కొంతంవాడ, మసీద్ ఏరియా, చింతల్‌వాడ, నిట్టూరు రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం 8గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

• రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు
ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ధాన్యం కుప్పలుగా పోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్సై డి.రమేశ్ అన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. రైతులు రోడ్లపై ధాన్యం పోయొద్దని సూచించారు.

• అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి
రామగుండం: ఇటీవల బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను సత్వరమే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ముద్రించిన కరపత్రాలను గురువారం సీఐటీయూ నాయకులు కుందనపల్లిలోని ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ ఇంధన డిపోల వద్ద కార్మికులకు పంపిణీ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి, సంతోష్, సంపత్, అశోక్ ఉన్నారు.

• నేత్రదానానికి ముందుకు రండి
కోల్‌సిటీ: మరణానంతరం నేత్రదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, ప్రతినిధులు దబ్బెట శంకర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన పొనగంటి సునీల్‌కుమార్ ఇటీవల ఆకార మరణం చెందాడు. కాగా అతని నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గురువారం కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

• నర్సరీ పనుల పరిశీలన
జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో గ్రామీణ నర్సరీ పనులను ఈజీఎస్ ఏపీవో సదానందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నర్సరీలో 10వేల మొక్కలు పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

• యాదవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తుమ్మల సంపత్
ధర్మారం: మండల కేంద్రంలోని యాదవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తుమ్మల సంపత్ కుమార్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ సంఘం భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపత్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా వేల్పుల కుమార్‌యాదవ్, పోలగాని రాజు, కోశాధికారిగా గ్యాగేటి అనిల్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల మహేశ్‌తో పాటు కార్యకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. సహకార సంఘాల ఫోరం మండల అధ్యక్షుడు జంగ మహేందర్‌యాదవ్, బీసీ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు శేఖర్, నాయకులు తిరుపతి, భూమేశ్, రవీందర్‌యాదవ్, రమేశ్, సత్యం పాల్గొన్నారు.

• నియామకం
జ్యోతినగర్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) జిల్లా ఫోర్ట్ వెల్ఫేర్ సెక్రటరీగా జాగటి శాంతను నియమిస్తూ నేషనల్ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్, నేషనల్ జనరల్ సెక్రటరీ నందం నర్సింహులు నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలో నివాసముంటున్న జాగటి శాంత పేద ప్రజలకు చేస్తున్న నిస్వార్థ సేవను గుర్తించి నియమించినట్లు పేర్కొన్నారు.

• తుక్కుగూడ ఘటనపై సమావేశం
పెద్దపల్లిరూరల్: తుక్కుగూడలో దళిత టీచర్ రాములుపై జరిగిన దాడిపై పెద్దపల్లిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం ప్రజా, ఉద్యోగ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నరేశ్, ప్రశాంత్, శ్రావణ్, రామలక్ష్మి, రవీందర్, కైలాసం, అనిల్, సురేందర్, ప్రవీణ్, సతీశ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం ఆవిష్కరించారు. డీటీఎఫ్ రామగుండం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉమామహేశ్వర్, రమేశ్, అంతర్గాం మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలాశౌరి రెడ్డి, చంద్రశేఖర్, పాలకుర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు దత్తమూర్తి, ప్రకాశ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్ రెడ్డి, నాయకులు రాంబాబు, మహేందర్, శ్రీనివాస్, రాంచందర్, నాగరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టె లక్ష్మయ్య, వెంకటరెడ్డి, రాజమల్లు, కుమారస్వామి, కొమ్ము సుధాకర్, కొమురయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ఎలిగేడు/జూలపల్లి: జిల్లాలోని పలు మండలాలకు చెందిన అధికారులు గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును శివపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జూలపల్లి ఎంపీవో అనిల్‌రెడ్డి, రెవెన్యూ గిర్దావర్ సందీప్‌రెడ్డి, ధర్మారం ఎంపీవో రమేశ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రమాకాంత్

సుల్తానాబాద్: వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని ట్రాఫిక్ ఎస్సై రమాకాంత్ సూచించారు. పట్టణంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంపై వచ్చేటప్పుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, తదితర ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకొని రావాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సిబ్బంది ఉన్నారు.

ప్లాట్ల విక్రయాలపై విచారణ నిర్వహించాలి
రామగిరి: మండలంలోని నాగెపల్లి పంచాయతీకి సంబంధించిన ప్లాట్ల విక్రయాలపై విచారణ నిర్వహించాలని గురువారం డీపీవో వీరబుచ్చయ్యకు మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య ఫిర్యాదు చేశారు. సింగరేణి భూనిర్వాసితుల కింద ప్లాట్లను కొందరికి కేటాయించి కొంత స్థలాన్ని వదిలేశారు. అట్టి స్థలాన్ని గుర్తించిన గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ అవసరాలకు విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్లాట్ల విక్రయాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని విలేజ్ అంతర్గాంలో ఐదేళ్ల క్రితం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఇప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు మల, మూత్ర విసర్జన చేస్తుండడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించి, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం


శిక్షణ పొందే యువతను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ: గోదావరిఖని తిలక్‌నగర్‌లోని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ గురువారం ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 మందికి 45 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఎదుట పార్క్ కోసం కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..
యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక 19వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ గురువారం కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నాయకులు గుండేటి రాజేశ్, మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే
యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక 18వ డివిజన్, అల్లూరు గ్రామంలో గురువారం గ్రామ దేవతల బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పాల్గొని గ్రామ కమిటీ సభ్యులకు రూ.2.50లక్షలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మార్క రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేశ్, సాగంటి శంకర్, మహంకాళి స్వామి, చక్రపాణి, రమేశ్, ముస్తఫా, సదానందం, తిరుపతి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న విశ్వనాథ్

కోల్‌సిటీ: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలను యాజమాన్యం తక్షణం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గోదావరిఖని తిలక్‌నగర్‌లోని కార్యాలయంలో గురువారం మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సింగరేణి వైద్య సదుపాయంలో కూడా ఏకపక్ష ధోరణి వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఓపీ ట్రీట్మెంట్‌లో రిటైర్డ్ అధికారులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు రిటైర్డ్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రిటైర్డ్ కార్మికుల పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసిం, సహాయ కార్యదర్శి రాములు, కోశాధికారి సీహెచ్ ఐలయ్య, కార్యవర్గ సభ్యులు గంధం రాజయ్య, ఇల్లందుల ముత్తయ్య, వి.శంకర్, భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

న్యాయమూర్తికి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావుకు గోదావరిఖని సబ్ డివిజన్ ఏసీపీ మడత రమేశ్‌గౌడ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టూటౌన్ సీఐ ప్రసాదరావు, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి నీరు విడుదల చేయండి

మంథని: కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ నుంచి యాసంగి పంటకు వెంటనే నీటిని విడుదల చేయాలని మంథనిలోని ఎస్సారెస్పీ ఈఈ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి వెంటనే నీటి విడుదలపై దృష్టిపెట్టాలని వారు కోరారు. ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, మంథని లింగయ్య, బావు రవి, వేల్పుల సురేశ్, సురేశ్ ఉన్నారు.

సింగరేణి రిటైర్డ్ టీచర్‌కు సన్మానం


సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి కాలరీస్ హైస్కూల్ సెక్టార్–3 ఉపాధ్యాయురాలు కుర్షీద్ జహాన్ బేగం డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు. కాగా ఆమెను గురువారం ఘనంగా సన్మానించారు. సింగరేణి ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, పాఠశాల కరస్పాండెంట్ డీజీఎం పర్సనల్ అండ్ ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సుందర్‌రావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి వేణుగోపాల్‌రావు తెలిపారు. బ్రెయిలీ 216వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దివ్యాంగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పిస్తాం

గోదావరిఖనిటౌన్: స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ సందర్శించారు. పాఠకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి, ఎమ్మెల్యేలు, సింగరేణి సహకారంతో గ్రంథాలయంలో సౌకర్యాలు, పక్కా భవనానికి కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ సిబ్బంది గఫర్, గోదావరిఖని గ్రంథ పాలకురాలు ఎం.భారతి, పాఠకులు రాజు, ప్రవీణ్, గడ్డం మధు, సంపత్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

మంథనిలో..
మంథని: మంథనిలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ గురువారం సందర్శించారు. గ్రంథాలయ పాఠకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తామన్నారు. సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.